# పరిచయం

తెల్లపూలున్న లేత ఆకుపచ్చ అర్గంజా చీరలో జానకి విరబూసిన జాజిపందిరిలా ఉంది. అందాలన్నీ గుత్తకు పుచ్చుకున్న రూపం ఆమెది,

ఫస్ట్‌షో సినిమాకి వెళ్దామని భర్త సుందరం ఉదయం ముటిచ్చాడు. అందుకని కొంచెం మేకప్‌కూడ చేసుకుంది. చీర కుచ్చెళ్ళు సుతారంగా సరిచేసుకుంటూ అద్దంలో చూసుకున్నప్పుడు ఎర్రటి పెదవులపై చిరునవ్వు తొంగలించింది. సుందరం వస్తే....' నను సిగ్గుతో చూపు మళ్ళించుకుంది, ఇంటిమేట్ స్ప్రే చేసుకుంది. హెంకి పైన కూడ కొంచెం స్ప్రే చేసి వాసన చూస్తూ అరమోడ్పు కన్నులతో అరక్షణం అలాగే ఉండి పోయింది.

నర్తకి కాలిగజ్జెల రవళిలో కాలింగ్‌బెల్ మోదింది. తనువు పులకరించింది, అద్దంలో మరోసారి చూసుకొని ముంగుర్లు సరిచేసుకుంటూ "కమంగ్....కమింగ్' అని సంగీతం పాడినట్లు బదులు పలుకుతూ గబగా వెళ్ళింది. అప్పుడే రెడీ అవడం చూసి సుందరం ఆశ్చర్యపోయి ఆనందిస్తాడనుకుంటూ తలుపు తీసింది.

వచ్చింది సుందరంకాదు.

అతిధి గుమ్మం దగ్గరే ఆమెవంక కన్నార్పకుండా చూస్తూ నిలబడిపోరాడు.

తనని తాను నమ్మనట్లు జానకి కూడా అలాగే ఉండిపోయింది.

కొద్దిసేపయ్యాక తమాయించుకొని తడబడుతూ "లోపలికి రండి" అని ఆహ్వానిస్తూ ముందుగదిలో సోఫా చూపించింది, చేత్తో బ్రీఫ్ కేస్ పట్టుకుని మంత్రముగ్ధుడిలా నెమ్మదిగా అడుగులేస్తూ "జానకీ! బావున్నావా?" అని సోఫాలో కూర్చున్నాడు. ఆ పిలుపు కలస్వనంలా వినిపించింది. బుగ్గలు కెంపులయ్యాయి, జవాబివ్వకుండానే లోపలికెళ్ళి ఫ్రిజ్‌లోంచి బాటిల్ తీసి మంచినీళ్ళు గ్లాసులో పోసి పట్టుకొచ్చి టీసాయ్ మీద పెట్టింది.

హఠాత్తుగా అతనిరాక ఆశ్చర్యం కలిగించింది. కాలేజీలో చదువుతుండగా వాళ్ళకుటుంబంతో బాగా పరిచయం ఏర్పడింది. దగ్గర్లోనే ఉండేవాళ్ళు. అతను తనకంటే సీనియరు. వాళ్ళింట్లో అతితా ఎంతో కలివిడిగా వుండేవారు, అతను తనకి ఏ సబ్జక్టులోనైనా సందేహంవస్తే విశదీకరించి చెప్పేవాడు. ఇద్దరూ చదువు గురించి లోకం గురించీ ఎన్నో సంగతులు చర్చించుకోవడం పరిపాటి, పరస్పరం ఆదరాభిమానాలు పెంచుకున్నారు. ఈనాడు అరుదుగా కనిపించే స్పందన అది స్పటికంవంటిది.

"జానకీ! అలాగే నిలబడి పోయావ్! కూర్చో! నన్ను గుర్తుపట్టావా...కొంపదీసి మర్చిపోలేదుకదా! భానూని.... అదే భానుమూర్తిని శాంతమ్మగారి రెండో అబ్బాయిని...."

"అబ్బే.... లేదు. ఎలా మర్చిపోతానండి" మాటలు తొట్రుపడుతున్నాయి.

"అండీ!" కళ్ళు పెద్దవి చేస్తూ అన్నాడు.

జానకి ఆమాటలోని అర్థం గ్రహించినా దానిని దాటేస్తూ "అమ్మా వాళ్ళంతా బావున్నారా?" అడిగింది పొడిపొడిగా.

భానుమూర్తి లోలోన నవ్వుకుంటూ "అమ్మాయిగారికి పెళ్ళయి ఏడాది కాకుండా చాలా మారిపోయారే!! అంతా కులాసా నిన్ను మరీ మరీ అడిగామని చెప్పమన్నారు" అన్నాడు.

జానకి వీధిగుమ్మం వైపు బెదురుగానూ, ఆత్రుతతోనూ చూస్తూ ఎదురుగా సోఫాలో కూర్చుంది.

భానుమూర్తి ఇంతవరకు సుందరం ప్రస్తావన తేకపోవడం ఆమెకి నచ్చలేదు.

గ్లాసు తీసి మంచినీళ్ళు తాగి వెనక్కి ఆనుకుని కూర్చున్నాడు చూపులు దించి సోఫాలో ఒక మూలకి ఒదిగి కూర్చున్న జానకి పరిస్థితి. గ్రహించి..ట్లు "మీవారు వచ్చేటయిమయిందా?" అని అడిగాడు.

"ఆ రావాలిపాటికి"

"మీ పెళ్ళికి రాలేకపోయాను. అయినా అమ్మా, చెల్లీ వచ్చారుగా సంగతులన్నీ చెప్పారు నేను ట్రయినింగుకని ఢిల్లీ వెళ్ళాను"

జానకి కొంచెం రిలీఫ్‌గా ఫీలయ్యింది కానీ భానుమూర్తి చెప్పే సంగతులు పైకంటే ధ్యాసంతా వీధిగుమ్మం పైనేఉంది. లోలోపల తెలుసుకోవాలనే ఉత్సుకత ఉన్నా మనసు నిలకడగాలేదు. ముఖంలో తత్తరపాటు కనిపిస్తోంది.

"ఇప్పుడేవస్తా ఉండండి కాఫీ తీసుకొస్తా" లేచి లోపతికివెళ్ళింది

"ఇల్లాలిగా ఎంతఎదిగిపోయావ్ జానకి" అనుకున్నాడు భానుమూర్తి సాలోచనగా.

అదే మూడేళ్ళ క్రితం అయితే జానకి గుక్క తిప్పుకోకుండా కబుర్లు చెప్పేది ఒక్క రోజు కనిపించకపోతే బోలెడన్ని సంగతులు పోగయేవి, కనిపించక పోవడానికి ముందు సరైన సంజాయిషీ ఇస్తేనే

బంగమూలి విచ్చుకొనేది. అంత ఆత్మీయత ఏమయింది. గుండెలోనే పదిలంగా దాచుకుందా! మరెవరికీ ముఖ్యంగా సుందరానికి కనిపించకూడదనా? కావచ్చు పెళ్ళయితే అంతా మర్చిపోవాలి కాబోలు శాశ్వతంగా పదిల పరచుకోదగినవి ఎన్నో ఉంటాయిగదా! అన్నిటికీ స్వస్తి పలకడం సాధ్యమూ కాదు. వాంఛనీయమూకాదు మానవత్వం విండిన మంచినిలువలు మరుపుకురావు పంచుకున్న ఆత్మీయత పెంచుకున్న స్నేహం.... నిజమే సమాజం అలా తయారయింది. ఎన్ని పెద్దకబుర్లు చెప్పినా మగవాడి మెదడు పొరలన్నీ యధాపూర్వకంగానే ఉన్నాయి. భర్తగా తనస్థానం నిరంకుశంగా ఉండితీరాలి మరోమగవాడి పరిచయం ఎలాంటి దైనా నిషిద్ధం ఎంత అన్యాయం అనిపించింది.

టీపాయ్‌మీద కాఫీకప్పు పెట్టిన చప్పుడయితే గతుక్కుమని తలపైకెత్తి చూశాడు భానుమూర్తి జానకి మనస్సులో సంఘర్షణకు జాలి కలిగింది.

"కాఫీ తీసుకోండి"

"నా పేరు అండి కాదని ఇందాకే చెప్పాను."

"నాకు తెలుసు" కంఠంలో మృదుత్వం పుట్టిపడింది.

ఈ సమాధానం వస్తుందనుకోలేదు.

కాఫీ తాగుతూ "ఆయనింకా రాలేదు" అన్నాడు.

"ఈ పాటికి రావల్సిందే"

ఆమె చూపులు మళ్ళీ వీధిగుమ్మంవైపు పరుగుతీశాయి.

భానుమూర్తి అది గమనించాడు.

"జానకీ! అయితే నేను వెళ్తున్నా రీజినల్ కాన్ఫరెన్స్ ఉంటే వచ్చా రెండు రోజులుంటాను. అశోకాలో దిగా...."

జానకి ఈ మాటలు వింటున్నట్లు లేదని చెప్పడం ఆపేశాడు.

వీధి గుమ్మంవరకు వెళ్ళి తిరిగి వచ్చింది. ముఖంలో డిజప్పాయింట్‌మెంటు ఆందోళన వెల్లడవుతున్నాయి.

ఈలోగా భానుమూర్తి బ్రీఫ్‌లోంచి రెండు గిఫ్ట్ ప్యాకెట్లు తీసి టీపాయ్‌మీద పెడుతూ "మీ దంపతులికి స్వయంగా ఇవ్వాలనుకున్నా ఈ గిఫ్ట్స్...."

కాసేపు ఉండమంటుందేమోనని ఎదురుచూశాడ.

"ఇది నీకు రెండోది మీ వారికి" విడి విడిగా పెట్టాడు

ఆయన ఉండగా యిస్తే బావుంటుంది" అని చెప్పి వూరుకుంది.

"నువ్వు తీసుకోకూడదా.... నన్ను పరాయివాడ్నిగా భావిస్తున్నావా!"

కాదంటుందని ఆశించాడు. అనలేదు.

"చెప్పాగా ఆయనుండగా యిస్తే...." అన్నది.

ఆ ప్యాకెట్టవంక ఒకసారి పరీక్షగా చూసి, తీసి బ్రీఫ్‌లో పెట్టుకున్నాడు.

"మంచిది జానకీ! నే వెళ్ళొస్తా..."

మర్నాటి ఉదయం రమ్మనమని చెబుతుందనుకున్నాడు. చెప్పలేదు.

లేచి గుమ్మందాకా వెళ్ళి జానకి వైపు చూశాడు "నన్నర్థంచేసుకో బాబూ! నేనిప్పుడు మరొకరిభార్యను మాట్లాడే స్వేచ్ఛ ఎలావుంటుంది?" అని చెబుతున్నట్టున్నాయి ఆమె చూపులు.

భానుమూర్తి ఆ చూపుల భావం ఎంతవరకు గ్రహించ గలిగాడో మరి?

అతను వెళ్తున్న వైపు చూస్తుండి పోయింది.

తెప్పరిల్లి చేతి గడియారం వంక చూసుకుంది.

తలుపు వేసొచ్చి ఒకసారి డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరకి వెళ్ళి అద్దంలో చూసుకుంది ముఖం కములిపోయినట్లనిపించింది. కలతంతా గూడుకట్టుకున్నట్లుంది

పైపైన కొంచెం పౌడర్ అద్దుకుంది. ఫ్రిజ్ తీసి కాపిని మంచి నీళ్ళు తాగింది.

సోఫాలో కూర్చుని పత్రిక తిరగేస్తోంది యాంత్రికంగా

మళ్ళీ బెల్ మోగింది.

వచ్చింది సుందరమవునో కాదో సందేహిస్తూ వెళ్ళి తలుపు తీసింది.

సుందరం పక్కనే భానుమూర్తి వాళ్ళ ధోరణినిబట్టి ఇద్దరూ సన్నిహితులనిపిస్తోంది. ఆశ్చర్యపడింది.

"జానకి! రెడీ అయ్యావ్ వెరిగుడ్....స్మార్ట్...." అభినందనకి ఆమె మనస్సు ఉప్పొంగింది పరిస్థితి అయోమయంగా వున్నా.

సంగతి గ్రహించి "వీడు భానూ....అదే భానుమూర్తి ఎం. ఎ.లో యిద్దరం క్లాస్‌మేట్స్ రిజర్వు బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు వస్తున్నట్లు నాకు ఆఫీసుకి ఉత్తరంరాశాడు ఇవ్వాళే అందింది. నా దగ్గరికొస్తే ఇంటికి పంపాను వీళ్ళంతా నీకు బాగా తెలుసటగా అందుకని కాసేపు కబుర్లు చెప్పుకుంటారనుకున్నా.... వీడేమో ముఖం వేలాడేసుకుని వెళ్ళి పోతుంటే పట్టుకున్నా...."

మిత్రులిద్దరూ సోఫాలో కూర్చున్నారు.

"జానకీ! మీరూ మనతో సినిమాకొస్తున్నాడు డిన్నర్ మనతోనే ఓ. కె. అదికాదోయ్ జానకీ! వచ్చిన వాణ్ని బెదరకొట్టేశావ్ గదా.... భానూ! ఇప్పుడే వాష్ చేసుకొస్తారా.... సినిమాకి టైమవుతోంది గా" అంటూ లోపలికి వెళ్ళాడు.

జానకి కూడా వెంట నడిచింది.

భానుమూర్తి గిఫ్టు ప్యాకెట్లు తీసి బయటపెట్టాడు సుందరం రాగానే "సుందూ! జానకి ఇల్లాలిగా చాలా ఎదిగిందిరా ఐయాం ప్రౌడ్ ఆఫ్ హర్ కాని అంతలా మారిపోతుందనుకోలా నాతో మాట్లాడేందుకే జంకిందనుకో నే చెబితే వినిపించుకోకుండా ఇంటికి వెళ్ళమన్నావ్"

"నీ మొహం జానకి అంతలా రిజర్వ్‌డ్‌గా ఉందంటే నేను నమ్మలేకుండా ఉన్నాను. గ్రాడ్యుయేట్ పైగా సన్నిహితమైన కుటుంబం కూడా."

"మనదేశంలో మగ వాళ్ళకి బ్రాడ్ అవుట్‌లుక్ రాలేదుకా. నీ సంగతి కాదనుకో.... సరే ఇప్పుడన్నా ఈ గిఫ్ట్స్ తీసుకునేదుందా? ఇందాక ఆఫీసులో అంటే జానకీ కివ్వమన్నావ్ జానకేమోనువ్వొస్తే గాని...."

కాఫీ కప్పులూ, బిస్కట్లు యాపిల్ ముక్కలూ ట్రేలో తీసుకొస్తున్న జానకిని చూసి వాక్యం మధ్యలో ఆపేశాడు.

ట్రే టీపాయ్ మీద పెట్టింది.

భానుమూర్తి ఇద్దరికీ ప్యాకెట్లు అందించాడు "విత్ బెస్ట్ విషెస్" అంటూ

జానకి సుందరం చిరునవ్వుతో అందుకుని "థాంక్స్" అన్నారు ఒకే శ్రుతిలో.

"టైమయింది.... లెట్ జ్ గో" అన్నాడు సుందరం.

సుందరం జానకి వైపు చూశాడు. ఆ చూపులు సగర్వంగా వున్నాయి జానకి భానుమూర్తి వైపు చూసింది. ఆత్మీయతను అణచి పెట్టే నిస్సహాయత నిండి వుందా చూపుల్లో భానుమూర్తి చూపులు గుమ్మం అవతలికి ప్రసరిస్తున్నాయి. విలువలు పెరిగే వ్యవస్థకోసం వెతుకుతున్నాయి ఆ కన్నులు.